# మనస్సును మాధవునితో నింపండి

విమల భావంబు కలుగుటే విద్యయగును
సరసగుణములు పొందిన చదువుయగును
సమత కల్గిన భావమే సహనమగును
సత్యమును దెల్పు మాట ఈ సాయిమాట.

కట్టెలందున నిప్పులు కలిగినట్లు
తిలల యందున తైలంబు వెలయునట్లు
అంతటను నిండియుండె శ్రీ ఆత్మమయుడు
మరువ బోకుడు ఇట్టి మంచిమాట.

**విద్యార్థులారా! విద్యార్థినులారా!**

ఎన్ని విద్యలు చదివియు ఎంతటి పదవుల నేలినప్పటికిని ఎన్ని భోగభాగ్యములు అనుభవించినప్పటికిని మానవతావిలువ ఒకటి లేకపోయిన ఇవన్నియు నిష్ప్రయోజనము. జీవితములో వివిధ పరిధుల మధ్య సామరస్యము, సమన్వయము ఉండినప్పుడే జీవితము అర్థవంతమౌతుంది. జీవితములో నిత్యసత్యములుగా ప్రకాశించే ప్రాచీన సాంప్రదాయములను సంస్కృతిని నేటి కాలానుగుణముగా సమన్వయము చేసుకొని సంరక్షించుటే ప్రధానమైన విద్య. ఇలాంటి పవిత్రమైన నిత్యసత్యమైన భావములు ఈనాడు విద్యార్థులయందు లోపించటం చేతనే విద్యార్థుల హృదయములు మలినమై అశాంతియై అసంతృప్తికి గురియై అస్తవ్యస్తమైన జీవితంగా గడుపుతున్నారు. నిరంతరము విద్యార్థుల మనసులు దుర్భావములచేతను దురాలోచనలచేతను దుష్కర్మలచేతను నిండి నిబిడీకృతమై ఉంటున్నవి. దీనికి కారణమేమిటి? దీని విమోచనకు సరియైన కృషి సల్పకపోవటమే. మానవతా విలువలు సరియైనవిగా అర్థం చేసుకోలేకపోవటమే. ఏమిటి ఈ మానవతా విలువలు? యమము, నియమము, ఈ

srisathyasaivachanamrutam

రెండింటియొక్క అంతరార్థం గుర్తించినప్పుడే మానవత్వం సార్థకమవుతుంది.

యమ అనగా అహింస, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము. అహింస అనగా త్రికరణశుద్ధితో మనోవాక్కాయములచే ఎట్టి ప్రాణిని బాధించకుండా ఉండటం. ఇటి పవిత్రమైన క్రియకు మానవుడు నోచుకోలేకపోతున్నాడు. తన స్వార్థము, స్వప్రయోజనం నిమిత్తమై అనేకమందిని బాధిస్తున్నాడు. నేను అనే అహంకారము, నాది అనే అభిమానము ఈ రెండే సమస్త అనర్థములకు మూలకారణము. అహంకార అభిమానములు నిర్మూలము గావించినప్పుడే మానవత్వము అభివృద్ధి గాంచటానికి అవకాశముంటుంటాది. కనుక అహింస అనేది మాటల చేత కాక మనసు చేత కాక క్రియలయందు ఎట్టి ప్రాణిని కూడను బాధించకుండా చూసుకోవాలి. రెండవది సత్యము. సత్యము సత్యమని చూచినది చూచినట్టుగా విన్నది విన్నట్లుగా చేసినది చేసినట్టుగా చెప్పినంత మాత్రమున సత్యము కానేరదు. తికాలాబాధ్యం సత్యమ్ అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చయత్. అని ప్రీతిహితముగా ఉంటుండాలి.

సత్యం ప్రియంగా ఉంటుండాలి. ఉద్వేగకరంగా ఉండకూడదు. సత్యము కదా అని ఇతరులను బాధించు రీతిగా సత్యము చెప్పకూడదు. ఇతరులకు ప్రీతికదా యని అసత్యమాడరాదు. సత్యమును వినయ విధేయతలతో మనోవాక్కాయముల చేత మనసును రంజింప చేయునట్లుగా పలకటం సహజం. సత్యమును విద్యార్థులు ప్రప్రథమము అనుసరించక తప్పదు. మానవ జీవితము సత్య జీవితము, పవిత్రమైన జీవితము, దివ్యమైన సత్యమైన జీవితము. జీవించగలిగిన జీవితము. ఇట్టి జీవితాన్ని అసత్య మార్గములో ప్రవేశించి స్వార్థ ప్రయోజన నిమిత్తమై మనము వ్యర్థము గావించుకొంటున్నాము. మూడవది ఆస్తేయము. ఎట్టి సమయమునందుకాని ఎట్టి పరిస్థితులయందుగాని ఇతరుల పదార్థములను మనము దొంగిలించరాదు. త్రికరణ శుద్ధిగా ఇట్టి భావమును గావించుకోవాలి. పదార్థమును దొంగిలించటం మాత్రమే కాదు. మానసికంగా ఇట్టి భావమే అతనిలో ప్రవేశించరాదు. ఇట్టి ఆస్తేయాన్ని అభివృద్ధి పరచుకోవటం అత్యవసరము.

**నిరంతరం బ్రహ్మముతో చరించండి**

ఇంక బ్రహ్మ చర్యం. ఇది లోకసంబంధమైన రీతిగా మనము ఆచరించటము అసాధ్యము.

sri sathyasai vachanamrutam

దుర్భావములకు దురాలోచనలకు, దుశ్చేష్టలకు మనసును ప్రవేశపెట్టరాదు. సరియైన బ్రహ్మచర్యమనగా నిరంతరము బ్రహ్మములో చరించటమే. బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. ఎట్టి తలంపులు వచ్చినా ఎట్టి ఆలోచనలు కలిగినా ఎట్టి క్రియలు చేయాలని ఇష్టపడినా ఇవన్నీ బ్రహ్మకర్మలుగానే విశ్వసించటము నిజమైన బ్రహ్మచర్యము. సర్వకర్మ భగవత్ప్రీత్యర్థమనే భావముచేత తానే ఒక బ్రహ్మముగా విశ్వసించి తాను ఆచరించే సర్వకర్మలు బ్రహ్మ కర్మలుగా విశ్వసించటము బ్రహ్మచర్యం. బ్రహ్మ నిర్మించిన వేదము, శాస్త్రము, ఇతిహాసము, పురాణము, ఉపనిషత్తు, బ్రహ్మసూత్రము ఇత్యాది గ్రంథములను నిరంతరము వల్లించటమే బ్రహ్మచర్యము. బ్రహ్మచర్యము జీవితభవనమునకు పునాది వంటిది. ఈ బ్రహ్మచర్యము అనే పునాదిపైననే గృహస్థము. వానప్రస్తము, సన్యాసమనే మూడు భవనములు అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. బ్రహ్మచర్యమనేది పవిత్రముగా, భద్రముగా, స్థిరముగా లేకుండిన గృహస్థ, వానప్రస్థ, సన్యాసములన్నీ కూలిపోవటానికి అవకాశము ఉంటుంది. కనుక జీవిత భవనమునకు బ్రహ్మచర్యమనేది ప్రధానమైన సూత్రము. ఇది నిర్మలమై, నిశ్చలమై నిస్స్వార్థమై, నిరహంకారముతో కూడినదిగా ఉంటుండాలి.

ఇంక ఐదవది అపరిగ్రహము. పరిగ్రహమనేది మహాపాపమని, దోషమని ఉపనిషత్తులు బోధిస్తూ వచ్చాయి. మనము ఎట్టి ఉపకారము చేసినప్పటికిని తత్ఫలితమై ఎట్టిదానినైనా అందుకొనుటకు సిద్ధముగా ఉండరాదు. కర్మములకు ప్రతిఫలము అందుకోవటం మానవసహజము. కాని ఇది శాస్త్రరీతిగా అసహజము. తల్లితండ్రి గురువుదైవము వీరినుండి మాత్రమే ఏమైనా పొందటానికి అధికారమున్నది. కాని ఇతరుల దగ్గరనుండి ఏ పదార్థముకూడను మనమందుకోరాదు. భగవంతుడు సృష్టికర్త, పోషణకర్త, సంరక్షకుడు, కనుక భగవంతుని చేత అన్నియును మనము పొందటానికి అధికారముంటుండాది. తల్లి తండ్రుల దగ్గర వారి శక్త్యానుసారము వారియొక్క యోగ్యతానుసారము అందుకోవలసిందేగాని మితిమీరి వారిని కూడను బాధించుటకు ప్రయత్నించరాదు. గురువు దగ్గరనుంచి కేవలము విద్య అనుగ్రహము మాత్రమే అందుకోవాలి. కోవాగురుః? యోగీహితోపదేష్టా హితమును బోధించేవాడు గురువు. శిష్యస్తుకో? యోగురువర్తియేవా! అతనిని సంతృప్తిపరచే మార్గము తప్ప అన్యరీతులలో ఏమాత్రము చేయి చాచరాదు.

కాని ఈనాటి విద్యార్థులయందు ఇది చాలా లోపించినది. తద్వారానే అనేక విధములైన జన్మలకు మనము గురౌతున్నాము. ఋణస్థులుగా మారిపోతున్నాము. ఈ ఋణఫలితముచేత ఏవిధంగా మనకు జన్మలభిస్తుందో చెప్పటానికి వీలుకాదు. అవసరమైనప్పుడు తప్ప అన్య సమయములందు ఇతరుల ఇంటియందు భుజించరాదు. నామిత్రుని ఇంటియందున్నాను కదా అని పది దినములో పదహైదు దినములో తిష్ఠవేసుకొని ఉండరాదు. నీమిత్రుడే వాని తల్లితండ్రులపైన ఆధారపడి ఉంటున్నాడు. అతనికి స్వాతంత్ర్యము లేదు. అట్టి పరిస్థితులయందు మిత్రుడు మిత్రుడని వారి ఇంటియందుపోయి కూర్చుని భోజనంచేయుటం మంచిదికాదు. మిత్రుడు సంపాదించినట్టిది కాదిది. మిత్రుని తల్లితండ్రులు సంపాదించినట్టిది. తల్లిదండ్రుల సంపాదన పుత్రులకు మాత్రమే అధికారమున్నదికాని అన్యులకులేదు. అలాంటి పరిస్థితుల లోపల నిత్యానిత్య విషయ పరిశీలన చేయకుండా మనము అన్యుల ఇంటియందుపోయి కూర్చుంటుంటాము. ఇది విద్యార్థులకు సరియైన అభ్యాసము కాదు. కనుక అపరిగ్రహమనేది అత్యవసరము. పత్రమో పుష్పమో ఫలమో తోయమో ఏచిన్న దానినైనా మనము ఇతరులకు అర్పించటానికి సిద్ధంగా ఉండాలి. కాని ఇతరులనుంచి అందుకోవటానికి ఏమాత్రము సిద్ధంగా ఉండకూడదు. ఇవి యమముయొక్క మానవతావిలువలు.

ఇంక నియమములో ఐదు నియమములుంటున్నాయి. మొదటిది శౌచము రెండవది తపస్సు, మూడవది సంతోషము, నాల్గవది స్వాధ్యాయము. ఐదవది ఈశ్వర ప్రణిధానము. శౌచమనేది రెండు విధములుగా ఉంటుండాది. బహిశ్శౌచము, అంతశ్శౌచము అని. బాహ్యంగా మనము పరిశుద్ధము కావాలంటే జలము చేత పరిశుద్ధమవుతున్నాము. ఈ పరిశుద్ధమనేది కేవలము దేహ పరిశుద్ధి మాత్రమేకాదు. నిత్యజీవితములో అనుభవించే ప్రతిపదార్థము కూడను పరిశుద్ధముగా ఉంటుండాలి. ధరించే వస్త్రములుకాని పరుండేటి పరుపులుగాని ఉపయోగించే గ్రంథములుగాని, నివసించే గృహముగాని సర్వము కూడను పరిశుద్ధముగా ఉంటుండాలి. శరీరములో సర్వభాగములు పరిశుద్ధముగా ఉంటుండాలి. అందుకోసమే నిత్యము తెల్లవారి లేచిన తక్షణమే పండ్లు తోముకోవటం అన్ని విధాలా నోరు కడుక్కోవటం, ముఖము కడుక్కోవటం ఈ విధమైన కర్మలంతా ఆరోగ్య నిమిత్తమై ఏర్పడినవే కాకుండా ఆనందము నిమిత్తము ఏర్పడినవని మనము గుర్తించాలి. మన పరిసర ప్రాంతములు కూడను పరిశుద్ధముగా

sri sathyasai vahini

ఉంచుకోటానికి తగిన కృషి చెయ్యాలి. ఇంక అంతశ్శుద్ధి. రాగద్వేషములచేత మనసు మలినమవుతున్నాది. దుష్ట భావములు ప్రవేశించటంచేత మనసు మరింత మలినమవుతున్నాది. కల్మషమైన మనస్సునందు పరిశుద్ధమైన భావములు యేమాత్రము కూడను ఆవిర్భవించవు. కనుక మనసును పరిశుద్ధముగా గావించుకునే నిమిత్తమై ప్రేమ, దయ, సహనము, సానుభూతి ఇత్యాది పవిత్ర భావములు మనము పెంచుకోవాలి.

ఇంక రెండవది తపస్సు. తలక్రిందపెట్టి కాళ్ళు పైనపెట్టి ఏదో ఒక విధమైన ఆసనము వేయటం మాత్రం కాదు. త్రికరణ శుద్ధిగా నీవు ఆశించిన లక్ష్యాన్ని పొందే నిమిత్తమై నిరంతరము దానిని చింతన గావించటము. అట్టి తాపమే తపస్సుగా మారుతుంది. నేను ఫలాన లక్ష్యాన్ని సాధించాలి అని నిరంతరము సర్వకాల సర్వావస్థలయందు కూడను దానిని స్మరిస్తూనే ఉంటుండాలి. కనుకనే సతతం యోగినః అన్నారు. నిర్గుణ నిరాకార స్వరూపమైన ఆత్మతత్త్వాన్ని పొందే నిమిత్తమై మనం పరితపించాలి. అట్టి పరితాపమే తపస్సుగా మారుతుంది. మనస్సునందు తలచిన దానిని, మాటలో చెప్పినదానిని క్రియలో ఆచరించి క్రియలో ఏకత్వాన్ని అనుభవించాలి. ఇదియే త్రికరణ శుద్ధి. అదే భగవశ్చింతన, ఇట్టి తపస్సు చేత నిర్గుణ నిరాకారమైన పరితత్త్వాన్ని పొందటానికి అవకాశముంటుండాది. గ్రామమును వదలి అడవులకు చేరి ఏదో ఆకులలములు మేసి జీవితమును వ్యర్థము గావించటము తపస్సుకాదు. మనలో ఉండిన దుర్భావములు దూరము చేయటమే తపస్సు.

**ఆస్తి ఆలి వీడి అడవికేగుట కాదు**
**భావమందు దుర్భావములు వీడుటే**
**యోగమగును అదియె త్యాగమగును.**

ఇట్టి పవిత్రమైన భావములచేత హృదయ శుద్ధిగావించుకోటమే తపస్సు.

ఇంక సంతోషము. సంతోషమనేది ఎప్పుడు వస్తుంది? తృప్తి కలిగినప్పుడే మానవునికి సంతోషము లభిస్తుంది. దురాశలు పెరుగుకొలది మనకు అసంతృప్తియే అభివృద్ధి అవుతుంది. విచారము కలిగిస్తుంది. కనుకనే ఉన్నదానిచే మనము తృప్తి పడాలి. కలిగినదానిచే ఆనందాన్ని అనుభవించాలి. మితి మీరిన కోరికలు కోరరాదు. మనము తృప్తిగా ఉండినప్పుడే మనకు

srisathyasaivachanamrutam

ఆనందము లభ్యమవుతుంది. He who has much satisfaction is the richest man, he is a satisfied man. కనుకనే మనము తృప్తిగా ఉంటుండాలి. ఆ తృప్తి చేతనే మనకు ఆనందము లభిస్తుంది. ఇంక నాల్గవది స్వాధ్యాయము. స్వాధ్యాయమనగా కేవలము వేదమును అధ్యయనము చేయటమే కాదు. భగవద్గీత, ఉపనిషత్తు, బ్రహ్మసూత్రము ఇత్యాది ప్రస్థాన త్రయము కూడను మనము ఉచ్చరిస్తూ ఉండాలి. పవిత్రమైన మతగ్రంథములు కూడను పరిచయం చేసుకోవాలి. ఏదో ఒక పవిత్రమైన గ్రంథమును చదువుతూ ఉండాలి. తద్వారా మన మనస్సులో చేరిన మాలిన్యాన్ని కొంత తీర్చుకోటానికి వీలౌతుంది.

ఇంక ఐదవది ఈశ్వరప్రణిధానము. మనము ఏమిచేసినప్పటికిని భగవత్ప్రీతికరమైన కర్మలు ఆచరించాలి. నేను చేసిన పని భగవత్ప్రీతికరమైనదా కాదా? ఈ కర్మల చేత భగవంతుడు తృప్తి నొందునా లేదా? అని ప్రతికర్మయందు విచారణ సలిపి భగవత్ప్రీతికరమైన కర్మలనే ఆచరించాలి. భగవంతుడనగా నీ కాన్షన్స్ నీ ఆత్మ తృప్తి లేనటువంటి కార్యములు ఏమాత్రము చేయరాదు. నీయొక్క హృదయమే నిన్ను అన్నివిధాలుగా శిక్షిస్తూ ఉంటుంది. అది తృప్తికరమైన పనియే కాకుండిన నీ మనసే నిన్ను నిందిస్తుంది. నీ ఆత్మ తృప్తిగా నీవు చేసే పనులయందు సరియైన భావాన్ని పెంచుకోవాలి. దీనినే వేదాంతమునందు సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం అన్నారు. నీకు ప్రీతికరమైన కర్మలు ఆచరించినప్పుడే నీకు అది శుభము నందిస్తుంది. ఇట్టి యమనియమములు రెండు పాటించినప్పుడే చతుర్విధ పురుషార్థములు సార్ధకము గావించుకున్న వారమవుతాము. శమదమాది సత్కర్మలను ఆచరించిన వారమౌతాము.

**మీరు పవిత్ర హృదయులు కావాలి**

ఈనాటి విద్యార్థులయందు ఈ యమనియమములనే మానవతా విలువలు ఏమాత్రము కనుపించటం లేదు. కనుకనే ఈనాటి విద్యార్థుల హృదయమంతా మాలిన్యముతో నిండి ఉంటుండాది. విద్యార్థులు పవిత్ర హృదయులు కావాలి. భవిష్యత్ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి. దేశముయొక్క మంచి చెడ్డలన్నియు విద్యార్థులపైనే ఆధారపడి ఉంటున్నాది. సర్వరంగముల యందు కూడను విద్యార్థులే రాణించాలి. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, లౌకిక విజ్ఞానములందు విద్యార్థుల ప్రభావాన్ని పవిత్రమైన రీతిలో తీర్చిదిద్దుకోవాలి. శమదమాది

sri sathyasai vechanamrutam

కర్మలు కూడను మనము ఆచరించటానికి ప్రయత్నించాలి. శమము అనగా మనోబుద్ధులను నిగ్రహించి వ్యవహారములను అదుపులో ఉంచుకోవటానికి ప్రయత్నించాలి. ఇవి అంతరింద్రియములయొక్క ప్రభావము. అంతరింద్రియముల ప్రభావమును అరికట్టినప్పుడే బహిరింద్రియములు సహజముగా మన అదుపులో ఉంటుంటాయి. కర్మేంద్రియ జ్ఞానేంద్రియములు బహిరింద్రియములు. మనము చూసేదంతా మంచిదిగా చూడాలి. చెడ్డది చూడకూడదు. వినేవి మంచిని వినాలిగాని చెడ్డ వినకూడదు. పలికే పలుకులన్ని మంచి పలుకులే పలకాలిగాని బాధించే పలుకులు పలకరాదు. తలచే తలపులు కూడను మంచివిగానే ఉంటుండాలి కాని చెడ్డ తలపులు మనలో ఆవిర్భవించరాదు. చేసే పనులన్నీ మంచిపనులుగానే ఉంటుండాలి. పదిమందికి ఆదర్శవంతమైన పనులుగా ఉంటుండాలి. ఇదియే దమము యొక్క ప్రభావము. అదే See no evil. See what is Good. Hear no evil hear what is good. Talk no evil, talk what is good. Think no evil, think what is good. Do no evil, do what is good. This is the way to God.

దమమనే దాంట్లో ఇంద్రియముల పవిత్రత ఇంత ఘాటుగా ఉండటం చేతనే మానవత్వము దివ్యత్వముగా మారటానికి అవకాశం ఏర్పడుతుంది. ఇలాంటి పవిత్రమైన గుణములను విద్యార్థులు పెంచుకోవాలి. అప్పుడే మానవత్వమనేది మనలో ఆవిర్భవిస్తుంది. మానవ సమాజములో ప్రేమ బీజములు నాటి, సహన ప్రసూనములు వికసింపజేసి, శాంతిఫలములు సమాజమున కందించటమే విద్యార్థుల యొక్క ప్రభావము. విద్యార్థులు ఉన్నచోట ప్రశాంతమైన వాతావరణము అభివృద్ధిగావించాలి. కానీ ఈనాడు దానికి విరుద్ధంగా ఉంటుండాది. ఎక్కడ అశాంతియో, ఎక్కడ అలజడియో అక్కడ విద్యార్థులున్నారనేది అర్థమవుతుంది. కనుక విద్యార్థులు చేరినచోట, విద్యార్థులు ఉన్నచోట ప్రశాంతమైన వాతావరణాన్ని అభివృద్ధి పరచుకోవాలి. ఇలాంటి బుద్ధులను, ఇలాంటి భావములను, ఇలాంటి సిద్ధులను అందించటమే విఘ్నేశ్వరుని ప్రభావము.

విఘ్నేశ్వరునికి చదువుల దేవుడని పేరు. ఇతను బుద్ధి సిద్ధులను అందించేవాడు. బుద్ధి అనగా పవిత్రమైన నిర్మలమైన భావము. నిత్యానిత్య విషయ పరిశీలనాతత్త్వము. ఈ జగత్తులో ఏది సత్యము ఏది అసత్యము. ఏ వ్యక్తిగాని, ఏ వస్తువుగాని, ఏ విషయముగాని క్షణక్షణమునకు

sri sathyasai vahini amrutam

మార్పు చెందునదే. శాశ్వతమైన వస్తువుగాని, శాశ్వతమైన వ్యక్తిగాని, శాశ్వతమైన విషయముగాని జగత్తులో మనకు కానరాదు. నిత్యసత్యమైనది ఒక్క ఆత్మతత్త్వము తప్ప అన్యము కాదు. అక్కడే నిత్యానిత్య విషయ పరిశీలన మనం చెయ్యాలి. ఇహ పరములయందు సుఖములు పొందటానికి ఏమాత్రము అభిలషించరాదు. ఇహ సుఖమనేది కేవలము క్షణభంగురము. ఇవన్నీ కదలిపోయే మేఘములవంటివి. కనుకనే శంకరులు మా కురు ధన బల యౌవన గర్వం, హరతి నిమేషాత్ కాలస్సర్వమ్' అన్నారు. ఇదంతా క్షణములోపల కదలిపోయేవి. మనం యవ్వనమని అనుకుంటుంటే వార్ధక్యము ప్రారంభిస్తున్నాది. బాల్యమని అనుకుంటుంటే యవ్వనం ప్రవేశిస్తున్నది. ఇవన్నీ అనుకున్నంతకాలం మనము అనుభవించటానికి ప్రయత్నించటం లేదు.

**ధర్మమును ఆచరించండి**

ఈవిధంగా క్షణక్షణమునకు మారుతుండే ఈ ఇహమునందు నిత్యసత్యమైన జీవితాన్ని గడపటం అసాధ్యం. పోనీ పరమునందైనా ఆనందాన్ని అనుభవిస్తామంటే క్షీణే పుణ్యేమర్త్యలోకం విశంతి' అది కూడను శాశ్వతం కాదు. ఎలక్షన్‌కు నిల్చిన వ్యక్తి ఏ ఐదు సంవత్సరములు మాత్రమో అసెంబ్లీకి పోతుంటాడు. ఒక్కొక్క సంవత్సరము తరిగే కొలది తరిగే కొలది అతను అసెంబ్లీనుంచి వేరౌతాడు. అదే విధముగనే మనము సంపాదించిన పుణ్యధన మనేది ప్రోగుచేసుకున్నంత కాలము మాత్రమే స్వర్గప్రాప్తి మనకు లభ్యమవుతుంది. ఆ పుణ్యము క్షీణించిన తక్షణమే తిరిగి మర్త్యలోకము రావలసి వస్తుంది. ఇహసుఖముగాని, పరసుఖముగాని రెండు కూడను మనకు పర్మనెంటు కాదు. శాశ్వతములు కావు. ఈ రెండింటికి అతీతమైన తత్త్వమే ఆత్మతత్త్వమే మన అధికార స్థానము. అదే నిర్గుణం నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య శుద్ధ బుద్ధయుక్త నిర్మల స్వరూపిణం అదియే నిత్యమైనది. అదియే సత్యమైనది. అదియే ఆనందమునందించేది. ఇట్టి ఆనందమును లక్ష్యమునందుంచుకొని ఈ భౌతికమైన లౌకికమైన జీవితాన్ని మనము సాధ్యమైనంతవరకు ధర్మవిరుద్ధము కానటువంటి మార్గములో అనుభవించుటకు ప్రయత్నించాలి.

విద్యార్థులారా! మన జీవితమనేది చాలావిలువైనదిగా భావిస్తున్నాము. ఎప్పుడది విలువైనది అవుతుంది? మానవతా విలువలు ఉండినంత వరకే దానికి విలువ. ఎప్పుడు ఈ

srisathyasaivachanamrutam

మానవతావిలువలు కోల్పోదుమో అప్పుడు మానవత్వమే కోల్పోతాము. దీనికి ఏమాత్రము కూడను విలువ ఉండదు. కనుక మానవతా విలువలు అనే సత్యప్రేమలను మనము అభివృద్ధిగావించుకోవాలి. అదియే భారతీయ సంస్కృతియందు సత్యంవద ధర్మంచర. ఈ రెండే మనకు సూత్రములు. ఇవే మనకు నేత్రములు. ఈరెండే మనకు శాస్త్రములు. ఇక్కడ వృష్టి సమిష్టి అనేరెండు తత్త్వములుంటున్నవి. వృష్టి అనగా ఒక్క శరీరముతో కూడిన తత్త్వము. ఇదియే జీవతత్త్వమని కూడను చెప్పవచ్చును. అనేక శరీరములతో కూడిన ఏకత్వాన్ని సమిష్టి అని చెప్పవచ్చును. ఒక్క చెట్టు చెట్టౌతుంది. వనము కాదు. ఇలాంటి అనేక వృక్షములు చేరినప్పుడే వనమౌతుంది. వృక్షమునకు వనమునకు ఎంత వ్యత్యాసమున్నదో వృష్టికి సమిష్టికి అంత వ్యత్యాసము ఉంటుండాది. ఒక ఇల్లు ఇల్లుగా ఉంటుండాది. అనేక వందల ఇండ్లు చేరినప్పుడు అది ఒక గ్రామంగా తయారౌతుంది. ఇంటికి గ్రామమునకు ఎంత వ్యత్యాసమో వృష్టి సమిష్టికి కూడను అంతవ్యత్యాసము. ఒక వ్యక్తి అనేది జీవతత్త్వము. సమస్త ఉపాధులతో ఉండిన దివ్యత్వాన్ని ఆచరించినప్పుడే అదే సమిష్టి తత్త్వం. అదే ఈశ్వర తత్త్వము. ఇదే జీవతత్త్వము అని. ఇలాంటి వృష్టి సమిష్టి తత్త్వాలు గుర్తించుకున్నప్పుడే మానవత్వాన్ని సరియైన మార్గములో అనుభవించటానికి వీలౌతుంది.

మనం ఎన్నియో అర్థం కాని చదువులంతా చదువుతున్నాము. ఈ చదువుల వలన ఏమైనా శాంతిసుఖములు అనుభవిస్తున్నాము? కొద్ది సుఖములు కలుగవచ్చు. అవి భౌతిక సుఖములు. అవి శాశ్వత సుఖములు కావు. పోనీ శాంతినందించు చున్నదా? శాంతి అనేది లేదు. శాంతి నీయందే ఉన్నది. బయట వస్తువులయందు ఏమాత్రము శాంతి ఆనందము కనిపించవు. ఆనందమును అనుభవించాలను కున్నప్పుడు మనయొక్క ఆత్మభావాన్నే మనం అనుసరించాలి. ప్రతి మానవుడు ఆనందం ఆనందం ఆనందం నిమిత్తమై అఱ్ఱులు చాస్తున్నారు. కానీ ఈ ఆనందం ఎక్కడ ఉన్నదనే విషయాన్ని విచారించటం లేదు. వస్తువులయందున్నదా? వ్యక్తులయందున్నదా? ఏమాత్రము లేదు. తనయందే ఉంటున్నది. తనయందే ఉండిన ఆత్మతత్త్వాన్ని బయట ప్రపంచములో వెదికినప్పుడు మనకు ఎట్లా లభ్యమవుతుంది? తనలో తాను వెదకాలి. అదియే నిజమైన విచారము.

sri sathyasai vachanamrutam

ఈ ఆనందమునకు మూలకారణమేమిటి? జగత్తు, జగత్తునకు మూలకారణమేమిటి ఒక విధమైన శక్తి. ఈ శక్తికి మూలకారణము ఏమిటి? మూలాధారమైన తత్త్వము. ఇదే తత్త్వము. తత్ అనగా అది. త్వమ్ అనగా ఇది. ఇది అనేది దగ్గరున్నటువంటిది. అది దూరమున్నటువంటిది. దూరమనగా ఇంద్రియములకు అతీతమైనది. ఇంద్రియములకు లోబడినది, this, దగ్గరది. ఇంద్రియములకు లోబడినదే ఈ ప్రపంచము, ఇంద్రియానికి అతీతమైనదే ఆత్మతత్త్వము. అట్టి ఆత్మతత్త్వాన్ని మనం పొందాలనుకున్నప్పుడు ఈ ఇంద్రియములు అతీతమైన స్థాయికి తిరగాలి. అదియే ధ్యానము అన్నారు.

**ధ్యానము కుదరకపోతే సమాజసేవ చేయండి**

ధ్యానమనగా concentration కాదు. Concentration తో కూడినది. మనం చూస్తున్నాం. చూచేది కన్నులు, వింటున్నాం. వినేవి చెవులు. పుస్తకం చదువుతున్నాం. ఈ పుస్తకాన్ని చేతిలో పట్టుకున్నాము. కన్నులతో అక్షరాలు చూస్తున్నాము. మనస్సుతో విచారణ చేస్తున్నాము. బుద్ధితో విమర్శగావిస్తున్నాము. అప్పుడే మనం పుస్తకాన్ని చదవటానికి వీలవుతున్నాది. కాబట్టి ఈ కన్నులు ఈ మనస్సు ఈ బుద్ధి ఈ చేతులు ఇవన్నీ senses. Sensesతో కూడినది కాబట్టే ఇది below senses. కాబట్టే concentration. ఇంద్రియములకు అతీతమైన స్థాయిలో పోయినప్పుడే మెడిటేషన్ అవుతుంది. అయితే ఆ మెడిటేషన్ స్థాయికోసం యీ concentration స్థాయి నుండి మనం మధ్యలో ఒక బోర్డరు దాటాలి. ఇది concentration అది meditation. మధ్యలో ఒక boarder ఉంది. అదే contemplation. ఈ contemplation క్రాస్ చేసిన తరువాతనే మనకు మెడిటేషన్ start అవుతుంది. ఈనాడు చాలామంది మెడిటేషన్. మెడిటేషన్ అని చాలామంది టైమ్ వేస్టు చేస్తున్నారు. ఒక్కక్షణమైనా మనసును నిలుపగలుగుతున్నారా! లేదు. కూర్చుంటున్నారు. అర్ధగంట ఒకగంట. ఈ విధముగా కాలము వ్యర్థము చేసే బదులు సమాజసేవ చెయ్యండి. ఎంతో హాయిగా ఉంటారు.

గంటసేపు నీవు కూర్చున్నావు. ఒక్కక్షణమైనా మనసు నిల్పగలిగావా? ఈ మనస్సు పిచ్చిపట్టినట్టే పరుగెత్తుతుండాది. ఈ పరుగెత్తే మనసును లాగటము. మళ్లీ పరుగెత్తటం. ఈ

sri sathyasai vachanamrutam

విధముగా అనవసరమైన క్రియలోపల కాలం ఎందుకు వ్యర్థం చేస్తున్నావు? Duty is God. నేను చేసే పనులన్నీ భగవంతునియొక్క సేవలే అనే భావంతో నువ్వు సేవచెయ్యి work will be transformed into worship. నీవు చేసే పని అంతా భగవంతుని పనిగా భావించు. ఇది సరియైన మెడిటేషన్‌గా వస్తుందిగాని కన్నులు మూసుకొని కదలకుండా కూర్చున్నంత మాత్రమున మెడిటేషన్ ఎప్పటికి కాదు. ఫోటోకు మాత్రం సరిగా ఉంటారు. ఇలాంటి మెడిటేషన్ పెట్టుకోవటం చేతనే ఈనాటి యువకులంతా మనసుయొక్క తత్త్వాన్ని వ్యర్థము చేసుకుంటున్నారు. ఏ పనిచేసినా భగవంతుని పనే. ఈ విధంగా భావించు. నా దేహమే ఒక పనిముట్టు. ఈ పనిముట్టు ద్వారా భగవంతుడే ఈ పని చేస్తున్నాడనే విశ్వాసాన్ని పెంచుకో. ఈ సాధన ఎంతో ఉపకారంగా ఉంటుంది. ఆదర్శవంతంగా ఉంటుంది.

మెడిటేషన్ మెడిటేషన్ అనేది స్వార్థముతో కూడి ఉంటుండాది. తనకు మాత్రమే తృప్తి. తనద్వారా ఇతరులంతా ఎంతబాధపడుతున్నారో ఇది ఏమాత్రము విచారించటం లేదు. స్వార్థస్వప్రయోజనములతో కూడిన భగవత్సేవ ఏమాత్రము పరసేవకాదు. స్వార్థాన్ని త్యాగము చేసి సర్వమును పరార్థంగా విశ్వసించి కర్మలు ఆచరించటమే నిజమైన ధ్యానము. దీనివల్ల టైమ్ వేస్ట్ అవుతున్నది. ఎనర్జీ వేస్ట్ అవుతుండాది. లైఫ్ వేస్ట్ అవుతుండాది. భగవన్నామస్మరణ చేసుకొంటూ అన్ని పనులు చెయ్యి. తద్వారా సర్వకర్మలు సార్థకమవుతాయి. భగవంతుడు ఎక్కడో ఒక్క ప్రదేశమునందు మాత్రమే లేదు. సర్వతః పాణిపాదం సర్వతోక్షి శిరోముఖం సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య. ఎక్కడ చూచినా అన్నింటియందు ఉంటున్నాడు. కేవలం ఒక్క ప్రదేశమునందే ఉంటున్నాడని నీవు ధ్యానం చేస్తే భగవంతుని కించపరచినట్లవుతుంది. సర్వత్ర ఉండిన భగవంతుని ఒక్కస్థాయిలో చూసుకోవటం సంకుచితమైన భావము. విశాలమైన భావమును పెంచుకోవాలి. అప్పుడే మనకు విచక్షణ అనేది అభివృద్ధి అవుతుంది. తద్వారా వివేకము అభివృద్ధి అవుతుంది. వివేకము ద్వారానే మనము కొంతవరకు విశ్వత్వాన్ని గుర్తించటానికి వీలౌతుంది. ఈనాడు విజ్ఞానమున్నది కాని వివేకము లేదు. విజ్ఞానం విరివిగా పెరిగింది కాని వివేకంతో దాన్ని విచారించటం లేదు. ఈ విజ్ఞానానికి వివేకం కూడా ఉండినప్పుడే సద్వినియోగ పరచటానికి వీలౌతుంది.

srisathyasaivacharamrutam

**గుణములను పెంపొందించుకోండి**

విద్యార్థులారా! మీరు మొట్టమొదట చేయవలసినది మీ విద్యను మీరు చక్కగా అభ్యసించండి. ఆ విద్యలలో ఉన్న విచక్షణను మీరు గుర్తించండి. ఇందులో ఉండినదానిని ప్రాక్టికల్‌లో ప్రవేశపెట్టండి. ఐదు విధములైన నాలెడ్జిలు ఉంటున్నాయని ఎన్ని పర్యాయములో చెప్పాను. కాని ఈనాటి విద్యార్థులంతా ఒక bookish knowledgeతోనే ఉంటున్నారు. ఈ బుకిష్ నాలెడ్జి నుంచి కొంతమంది పైకి పోయి సూపర్ ఫిషియల్ నాలెడ్జి లో చేరిపోతున్నారు. కాని జనరల్ నాలెడ్జి లేకపోతుండాది. డిస్క్రిమినేషన్ నాలెడ్జి అంతకంటే లేకుండా పోతున్నాది. ఇంక ప్రాక్టికల్ నాలెడ్జి ఎట్ల వస్తుంది? కనుక ప్రాక్టికల్ నాలెడ్జి అత్యవసరము. ఈ ప్రాక్టికల్ నాలెడ్జి లేకపోవటంచేతనే మన విద్య ఆర్టిఫిషియల్ విద్యగా ఉంటుండాది. మన యం.ఎస్.సి. బాయ్ చెప్పాడు. మనిషి సరైన వాడయినప్పుడే ప్రపంచమంతా సరియైనదవుతుంది. మనిషి మారినప్పుడే సమాజం మారుతుంది. సమాజం మంచిదైనప్పుడే దేశం మంచిదౌతుంది. దేశమంతయు వ్యక్తియొక్క గుణములపైన ఆధారపడి ఉంటుండాది. వ్యక్తియొక్క గుణములు అత్యవసరంగా పెంచుకోవాలి. ఎంతబలము ఎంత తెలివి ఉండిఏమి ప్రయోజనము. గుణము కూడను ఉంటుండాలి.

**నేటి విద్యలెల్ల తెలివి తేటలు పెంచు**
**కొంచమైన గుణము పెంచబోదు**
**కోటి విద్యలుండి గుణములేకున్నచో**
**అట్టి విద్యలెల్ల మట్టి సుమ్ము.**

గుణము లేని తెలివితేటలు ఎందుకోసం. మూడు నాలుగు డిగ్రీలు తీసుకునే బదులు ఒక్క డిగ్రీ ఆచరణలోపెట్టుకో చాలు. అదే ఉత్తమమైన విద్య అవుతుంది. చదువు చదువంటే కేవలము గ్రంథ పరిచయము కాదు. సమాజము యొక్క సుక్షేమాన్ని మనము దృష్టియందుంచుకోవాలి. ప్రపంచమునకు ఆదర్శవంతమైన విద్యార్థులుగా మనము రూపొందాలి. అలాంటి ఆదర్శవంతమైన జీవితమే లేనప్పుడు మన విద్యల ప్రయోజనమేమి?

**ఎం.ఏ.లు బి.ఏలు ఏర్పడ జదివియు పేరుగించిన పెద్దవారలైన**

sri sathyasai vahamrutam

**సంపదలుండియు సద్దానపరులైన పుడమికీర్తిని గన్న పుణ్యులైన**
**ఆయురారోగ్యము లనవరతంబుండి పరిపూర్ణ బలులగు వారలైన**
**జపమును తపమును సతతంబు చేయుచు వేదంబులను నేర్చు విప్రులైన**
**చదువు చదువు చదివి చాల వివేకియై**
**మడిగి తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి ఉన్నను**
**హీనుడవగుణంబు మానలేడు**
**తరచి చదువు చదవ తర్కవాదమె గాని**
**పూర్ణ జ్ఞానంబెపుడు పొందలేడు**
**చదువు చదువు చదివి చావంగనేటికి**
**చావులేని చదువు చదువవలెను.**

తర్కము కోసమా నీవు చదువుతున్నావు? ఆర్గ్యుమెంటు కోసమా నీవు చదువుతున్నావు? వాదన వలన వైరము పెరిగిపోతుంది. వాదే వాదే వర్ధతే వైరమ్' అని వాదించేవారికి వైరము పెరిగిపోతుందిగాని స్నేహము కలుగదు. కనుక మనము వాదనకు ఏమాత్రము తావు ఇవ్వరాదు. సహనముతో ప్రేమతో సమన్వయము గావించుకునే విషయాన్ని గుర్తించుకోవాలి. అట్టి సమన్వయ భావమే విద్యగా విశ్వసించాలి. అనేకత్వములోని ఏకత్వాన్ని గుర్తించాలి. అప్పుడే మానవత్వములో దివ్యత్వమనేది ప్రకాశిస్తుంది. దివ్యత్వం మానవునికంటె ప్రత్యేకంగా లేదు. మానవుని యొక్క అంశమే దివ్యత్వము. దేహభ్రాంతి ఉండటం చేతనే దివ్యత్వాన్ని మరచిపోతున్నారు.

**పాంచభౌతికము దుర్బలమైన కాయంబు**
**తొమ్మిది చిల్లుల తోలు తిత్తియెగాని**
**కాంతి కలిగిన వజ్రఘటము కాదు**
**నిమిష నిమిషంబునకు నీచులూరునెగాని**
**పునుగు జవ్వాదులు పుట్టబోవు.**

srisathyasaivachanamrutam

బాడీ ఒక పనిముట్టు. ఎందుకోసం వచ్చింది ఈ పనిముట్టు. 'పరోపకారార్థ మిదం శరీరమ్' పరోపకార నిమిత్తమై దేహమేర్పడింది. మనము సమాజసేవ చెయ్యాలి. ఆ సేవద్వారానే మనలో ఆవిర్భవించిన ఆత్మప్రకాశము విజృంభిస్తుంది. కనుక దేహాన్ని సార్థకము గావించుకొని మనసుయొక్క మాలిన్యాన్ని నిర్మూలనం గావించి దివ్యత్వమనే ఆత్మతత్త్వములో మన జీవితాన్ని అంకితం చేసి మానవత్వం సార్థకం గావించుకోవాలి. 'కర్మాను బంధీని మనుష్యలోకే' కర్మచేతనే కూడింది ఈ దేహము. కర్మకాయంతోనే చెయ్యాలి. ఈ కాయకర్మల చేతనే కాలాన్ని పవిత్రం చేసుకోవాలి. కాల కర్మ కాయ కారణములు పవిత్రమైనప్పుడే కర్తవ్యం చక్కగా జరుగుతుంది. దేశకాల పరిస్థితుల ప్రభావాలను మనము గుర్తించి వర్తించాలి.

**దివ్యజీవనము గడపండి**

వినయ విధేయతలు విద్యార్థులకు అత్యవసరము. పెద్దలను గౌరవించాలి. తల్లి దండ్రులను ప్రేమించాలి. గురువులకు శుశ్రూష గావించాలి. తోటి మానవులతో కలసి మెలసి తిరగాలి. ఆ యూనిటీవల్లనే ఒక విధమైన ప్యూరిటీ ఏర్పడుతుంది. ఆ ప్యూరిటీ వల్లనే డివినిటీ ఏర్పడుతుంది. యూనిటీ లేకుండా మనకు ప్యూరిటీ రాదు. యూనిటీ లేని దగ్గరఏమిటి సార్టవుతుంది. ఎనిమిటీకి మనము ఏమాత్రము అవకాశము ఇవ్వరాదు. ఈ యమ నియమములనే పదిసూత్రములను మనము చక్కగా పాటించుకుంటే మానవత్వమనేది మనలో ఎంతైనా అభివృద్ధి అవుతుంది. అహింస, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము ఈ ఐదింటిని మనము ఆచరిస్తేచాలు. ఎవ్వరినీ నొప్పించరాదు. ఎవరినీ బాధించరాదు. సాధ్యమైనంత వరకు నీలోనీవు అరికట్టుకొని నీదారిని నీవు నిగ్రహించుకొనుటకు ప్రయత్నించు. పరుల వస్తువులను ఏమాత్రము ఆశించవద్దు. నీకు కావలసి వస్తే దైవాన్ని ప్రార్థించు. దైవంపైన నీకు సర్వాధికారము ఉంటుండాది. అంతేకాని మానవునికి మాత్రము చేయి చాచకు. అదియే విద్యార్థులు ప్రధానముగా గుర్తించవలసిన విషయము. మీశక్తిపైన మీరాధారపడండి. మీ కర్మలపైన మీరు ఆధారపడండి. సోంబేరులు కాకూడదు. తద్వారా మనలో ఎన్ని విధములైన దుర్గుణములో ప్రవేశిస్తాయి. మనం నిరంతరము పనిలో ప్రవేశించాలి. వర్క్, వర్క్, వర్క్ కర్మ కాంక్షను మనము ఆశించటానికి కర్మాను బంధులైనందుకు కర్మదీక్షను వహించాలి. అప్పుడే మనకు ఉత్సాహకరమైన హృదయము

ఉప్పొంగుతుంది. దైవప్రేమ చేత, దివ్యమైన, భావముచేత జీవితమంతా పవిత్రంగా విశ్వసించాలి.

విద్యార్థులారా! భజన, భజన అని ఈ భజన ఏవిధమైన ఫలితము లేనిదిగా మీరు భావించరాదు. భజనలో ఉండిన ఆనందము, భజనలో ఉండిన సౌఖ్యము మరి దేనిలో మనకు లభ్యముకాదు. ఈ భజన అనేది మన జీవితానికి ఒక భోజనము. నిరంతరము భగవద్భజన చేసుకుంటుంటే జీవితమనేది ఎంతో ఆనందమయంగా ఉంటుంది. జయదేవుడు, గౌరాంగుడు, తుకారాం మీరందరు భజన చేతనే జీవితాన్ని సార్థకము గావించుకున్నారు. ఏ ధ్యానము చేతనో, ఏ జపము చేతనో ఎవరు ముక్తిని పొందినవారు కనుపించటం లేదు. కనుక నవవిధములైన మార్గములన్నీ కూడను భగవంతునియొక్క చింతనలే.

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం**

ఈ నవ విధమైన మార్గములు ఆ గమ్యాన్ని చేర్చే మార్గములే. ఎన్ని చదువులు చదివినప్పటికిని భగవంతుని చింత మీరు మానకూడదు. భగవద్విషయమనే దాంట్లో అలక్ష్యం చేయటం చేతనే మనలో అనేక రకములైన అశాంతులు కలుగుతూ ఉన్నాయి. మన భజన ప్రపంచానికి కూడను శాంతి నందిస్తుంది. భజన లోకాస్సమస్తా సుఖినోభవంతు అనే భావంతో చెయ్యాలి. లోకమంతా సుక్షేమంగా ఉండాలని ఆశించాలి. అప్పుడే మనలో పవిత్రమైన భావము అభివృద్ధి అవుతుంది.

విద్యార్థులారా! మీలో ఆవేశించే దుర్భావములను, దుర్గుణములను, దురాలోచనలను దూరం చేసుకోటానికి ప్రయత్నించండి. అదే మీ మానవత్వాన్నంతా నిర్మూలనం చేస్తుండాది. ఎన్ని చదువులుంటుండికూడను మానవత్వం లేకపోతే జీవితం వ్యర్థమే. నేను మానవుడు, నేను మానవుడు అనేది అర్థసత్యం మాత్రమే అని చెప్పాను. రెండవ అర్థసత్యం నేను పశువుకాదు. నేను పశువుకాదు. నేను పశువుకాదు. ఈ రెండు చేరినప్పుడే మన మానవత్వము సార్థకమవుతుంది. Iam not animal. Iam not animal. ఈ రెండింటిని మనం చేర్చుకోవాలి. నువ్వు మాన్ అని అనుకుంటున్నావు. పశువుగా ప్రవర్తిస్తున్నావు. నీవు మాన్ అనుకున్నప్పుడు మాన్‌గా నీవు ప్రవర్తించాలి. దురభ్యాసములకు దుశ్చింతలకు ఏమాత్రము

sri sathyasai vachanamrutam

అలవాటు కాకూడదు. పవిత్రమైన దీనిని పొందాలనుకున్నప్పుడు హృదయములోపల భగవచ్చింతన జరపాలి.

**(తేది. 03-09-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam